క్లుప్తంగా

ఘనంగా దేవాలయ వార్షికోత్సవాలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి దేవాలయ 22వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం, పల్లకీ సేవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కట్ట ప్రవీణ్, ఆలయ అర్చకుడు రాఘవేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

షాద్‌నగర్: మండల పరిధిలోని దూసకల్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు తవిడిశెట్టి సంతోష్‌బాబు మంగళవారం తన సొంత ఖర్చులతో సుమారు 90 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రేవతి, ఉపాధ్యాయులు సతీష్, రెడ్యాలాల్, శైలజ, సంతోష్‌బాబు, శ్రీనివాస్, సర్ఫరాజ్ అన్వర్, స్వరాజ్‌బాబు, నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



దాత ప్రతాప్‌రెడ్డితో కలిసి బోరును ప్రారంభిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగడపల్లిలో నీటి సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరడంతో మంగళవారం ఆయన రూ.2లక్షలు సొంత డబ్బులు ఖర్చు చేసి కొత్తగా బోరు వేయించి మోటార్ బిగించి గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. అడిగిన వెంటనే సమస్య తీర్చేందుకు ముందుకొచ్చిన గోనే ప్రతాప్‌రెడ్డిని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, మాజీ సర్పంచ్‌లు సత్తయ్యగౌడ్, రాములుగౌడ్, నాయకులు గాయాస్, శ్రీనివాస్‌గౌడ్, చంద్రయ్య, రాఘవేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, అజీమ్, శ్రీకాంత్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనతోనే అభివృద్ధి

షాద్‌నగర్‌రూరల్: బీసీలు తమ హక్కులను సాధించుకున్నప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మి అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో బీసీసేన పట్టణ మహిళా అధ్యక్షురాలు కాటం భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మహిళా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీసేన 3వ వార్డు నూతన మహిళా కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షురాలిగా వినోద, ఉపాధ్యక్షురాలిగా స్వాతి, కార్యదర్శిగా స్రవంతి, సహాయ కార్యదర్శిగా నవనీత, కోశాధికారిగా సుమతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వరలక్ష్మి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా బీసీలు నేటికీ వెనుకబడి ఉన్నారన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆర్థిక, ఉపాధి రంగాలలో బీసీలకు రావాల్సిన వాటా దక్కడంలేదని ఆరోపించారు. కులాలకతీతంగా బీసీలందరూ ఏకతాటిపైకి రావాలని సూచించారు. హక్కుల సాధనకు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం నూతన సభ్యులకు నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖరప్ప, మేకల వెంకటేశ్, బాలమణి, నర్సింలు, అరుణగౌడ్, సరస్వతి పాల్గొన్నారు.

ఉన్నత చదువుల్లో రాణించాలి



కంప్యూటర్లు అందజేస్తున్న నాయకులు

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని బీజేపీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని సిద్దాపూర్‌లో మంగళవారం స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకుడు గన్నోజు శ్రీధర్‌చారి, ఇతర సభ్యుల సహకారంతో సమకూర్చిన రెండు కంప్యూటర్లను ప్రాథమిక పాఠశాలకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ఫుల్.. సౌకర్యాలు నిల్



తరగతి గదిలో ఇరుకుగా కూర్చున్న విద్యార్థులు



మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల

సరిపడా గదులు, ఆటస్థలం లేక విద్యార్థుల ఇబ్బందులు

- వరండాలో విద్యాబోధన
- మూత్రశాలలు లేక తప్పని తిప్పలు
- మొయినాబాద్‌లో ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి

మొయినాబాద్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులు ఉన్నా... విద్యార్థులు కూర్చోవడానికి సరిపడా గదులు లేవు. కొత్తగా విద్యార్థులు చేరుతున్నా వారికి సరైన సౌకర్యాలు లేవు. ఇరుకు గదులు, వరండాల్లో, కమ్యూనిటీ భవనంలో విద్యాబోధన కొనసాగుతోంది. విద్యార్థులు ఆడుకోవడానికి స్థలం సైతం లేదు. ఇదీ మొయినాబాద్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి.

మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం 'సాక్షి' విజిట్ చేసింది. ఇక్కడ 1 నుంచి 7వ తరగతి వరకే విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది. విద్యాబోధన చేసేందుకు 9 మంది టీచర్లు ఉన్నారు. పాఠశాలలో మొత్తం 250 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్త అడ్మిషన్లు కూడా బాగానే వస్తున్నాయి. కానీ ఈ పాఠశాలలో ఐదు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. అవి కూడా చిన్నవిగా ఉండటంతో విద్యార్థులు ఇరుకుగా కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని తరగతుల విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఇంకొన్ని తరగతుల విద్యార్థులను పాఠశాల పక్కనే ఉన్న కమ్యూనిటీ భవనంలో కూర్చోబెడుతున్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి ఆటస్థలం లేదు. తరగతి గదుల ముందు కనీసం స్థలం లేకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఉదయం పూట ప్రార్థన చేసే సమయంలోనూ విద్యార్థులంతా ఇరుకుగానే నిలబడుతున్నారు.

పిల్లలంతా ఇతర ప్రాంతాలవారే..

మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులంతా ఇతర ప్రాంతాలకు చెందినవారే ఉన్నారు. స్థానిక పిల్లలు కేవలం 20 శాతం లోపే ప్రభుత్వ పాఠశాలకు వస్తున్నారు. వికారాబాద్, నారాయణపేట్ జిల్లాల్లోని తాండూర్, పరిగి, కుల్కచర్ల, బంటారం, కొడంగల్, మద్దూర్ ప్రాంతాలకు చెందిన చాలా మంది మొయినాబాద్‌కు వలస వచ్చి అడ్డాకూలీలుగా పనిచేస్తున్నారు. వారి పిల్లలను ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారు. ఇలా ప్రతి సంవత్సరం 50–60 మంది విద్యార్థులు వలస వచ్చినవారే చేరుతుండడంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రభుత్వం అందుకు తగినట్లుగా పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి



ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని ఎల్గొండగూడ ప్రాథమిక పాఠశాలను మంగళవారం సాక్షి విజిట్ చేసింది. ఆ పాఠశాలలో గత సంవత్సరం 12 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఈ సంవత్సరం ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే 22 మంది విద్యార్థులు సర్కారు బడిలో అడ్మిషన్ తీసుకున్నారు. ప్రస్తుతం 32 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నోట్‌బుక్స్, దుస్తులు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం వండి పెట్టారు. వారికి పుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించారు. మల్లారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాల గత రెండు సంవత్సరాలుగా మూతబడి ఉంది. ఈ సంవత్సరం బడిబాట కార్యక్రమంలో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్‌కు రాలేదు.

సరిపడా తరగతి గదులు లేవు



మొయినాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, వసతులు లేవు. టాయిలెట్స్ కూడా తక్కువగా ఉన్నాయి. పాఠశాల ఆవరణ చిన్నదిగా ఉండటంతో విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉంది. ఈ సారి అడ్మిషన్లు బాగానే వస్తున్నాయి. ఇప్పటికే 30 మందికిపైగా విద్యార్థులు జాయిన్ అయ్యారు.

– జోసెఫ్‌రెడ్డి, హెచ్‌ఎం, మొయినాబాద్ ప్రాథమికోన్నత పాఠశాల

నాణ్యమైన విద్యనందిస్తాం



తమపై నమ్మకంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడం సంతోషంగా ఉంది. వారి నమ్మకాన్ని వమ్ము చేకుండా నాణ్యమైన విద్యనందించి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటున్నాం. కేవలం 12 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో ఈ సంవత్సరం 32 మంది విద్యార్థులను చేర్పించుకున్నాం.

– మల్లేశ్‌గౌడ్, హెచ్‌ఎం, ఎల్గొండగూడ

అడ్మిషన్ల కోసం క్యూ



ఆరో తరగతిలో అడ్మిషన్ల కోసం క్యూ కట్టిన విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుండడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని హెచ్‌ఎం ఆంజనేయులు అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అడ్మిషన్లు జోరుగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు క్యూలో నిలబడి అడ్మిషన్లు పొందారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి ఎంతో కృషి చేస్తుండడంతో సర్కారు బడులు విద్యార్థులతో కళకళలాడుతున్నాయన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, రీడింగ్ బుక్స్, ప్లేగ్రౌండ్, ప్రయోగశాలలు అన్ని అందించడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఇప్పటికే 197 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. 7–10వ తరగతి వరకు 180 మంది ఉండగా.. 6వ తరగతిలో ఇప్పటివరకు 17 మంది చేరారన్నారు. వారం రోజుల్లో 6వ తరగతిలో 50 మందికిపైగా విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు చేర్పించి వారి భవిష్యత్తుకు తోడ్పడాలని కోరారు. బడీడు పిల్లలను కూడా తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్ ఉపాధ్యాయురాలు సుమిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కారు బడుల బలోపేతానికి చర్యలు

ఎంఈఓ పురన్‌దాస్



జాలగూడ పాఠశాల ఆవరణను ట్రాక్టర్‌తో శుభ్రం చేయిస్తున్న ఎంఈఓ పురన్‌దాస్, గ్రామస్తులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మండల విద్యాశాఖ నడుం బిగించింది. గతేడాది జీరో ఎన్‌రోల్‌మెంట్ నమోదైన మండలంలోని ఇబ్రహీంపల్లి, నారాయణదాస్‌గూడ, జాలగూడ పాఠశాలలను ఈ ఏడాది తెరిపించి అడ్మిషన్లు చేసేందుకు కృషి చేస్తున్నట్లు మండల విద్యాధికారి పురన్‌దాస్ తెలిపారు. ప్రత్యేకంగా ఈ మూడు పాఠశాలలను మంగళవారం సందర్శించి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి అడ్మిషన్లు చేయించాలని కోరారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల ఆవరణలను సైతం శుభ్రం చేయించారు. విద్యార్థులు ఎక్కువగా వస్తే అక్కడ ఉపాధ్యాయులను సైతం ఏర్పాటు చేస్తానని గ్రామస్తులకు ఆయన హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని పాఠశాలలు ఇంగ్లిష్ మీడియంలోనే కొనసాగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు కిష్టయ్య, శంకర్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

ఎంఈఓ మనోహర్



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ మనోహర్

షాద్‌నగర్‌రూరల్: అంగవైకల్యం కలిగిన విద్యార్థులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఈఓ మనోహర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని భవిత కేంద్రంలో సమ్మిళిత విద్య రోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంగవైకల్యం కలిగిన విద్యార్థులకు వీల్ చైర్స్, గుడ్డి, మూగ, చెవిటి విద్యార్థుల చదువుకు సంబంధించిన పరికరాలను అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. అంగవైకల్యం కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. అంగవైకల్యం ఉన్న విద్యార్థులను విద్యకు దూరం చేయొద్దని, వారికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతీ విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భవితకేంద్రం హెచ్‌ఎం శశికళ, ఉపాధ్యాయులు స్వప్న, చంద్రబాబు, వెంకటేశ్, సరిత, స్రవంతి, రమాదేవి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: రాజకీయాలు, పార్టీలకతీతంగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోనే కొత్తూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన చైర్‌పర్సన్ లావణ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు నిర్దిష్టమైన ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. స్వతహాగా ఆదాయ వనరులను సమకూర్చుకునే అవకాశాలను గుర్తించాలన్నారు. అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడానికి తనవంతు సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండదని తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. కులగణన జరిగిందని రిజర్వేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత కేబినేట్ సమావేశం అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. అప్పటివరకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా బరిలో ఉండే అభ్యర్థులు అనవసర ఖర్చులు పెట్టి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు.

ఫోన్‌ట్యాపింగ్ నేరస్తులకు శిక్ష ఖాయం

రాష్ట్రవ్యాప్తంగా పెను దుమారం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం షాద్‌నగర్ వరకు రాగా ఈ విషయమై ఎమ్మెల్యే స్పందించారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కుట్రలు, కక్షలు లేకుండా పారదర్శకంగా విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందో తెలుసుకొని ఆధారాలు ఉంటే తప్పకుండా అందుకు బాధ్యులుగా ఉన్న వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



పాపిరెడ్డిగూడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కిష్టయ్య, మాజీ ప్రజాప్రతినిధులు

కేశంపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య సూచించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, నర్సరీలు, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని కోరారు. హరిత హారంలో నాటేందుకు నర్సరీల్లో మొక్కలను అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం కొండారెడ్డిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ కేశంపేట సెక్టార్ సూపర్‌వైజర్ దివ్యసింగ్, పంచాయతీ కార్యదర్శి స్వరూప్, అంగన్‌వాడీ టీచర్ జగదీశ్వరిబాయి, మాజీ సర్పంచ్ పోలేమోని శివయ్య, మాజీ ఉపసర్పంచ్ అబ్బి సుందరయ్య, చేవెళ్ల నర్సింలు, కృష్ణారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకొని మానసిక ప్రశాంతత పొందాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్‌లోని శ్రీ భవానీమాత దేవాలయంలో ఆయన పలువురు నాయకులతో కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు కొందూటి నరేందర్, బచ్చలి నర్సింహ, కిషోర్, సుజీవన్, నందిగామ శ్రీనివాస్, జంగయ్య, నర్సింహ, భువనేశ్వర్‌రెడ్డి, శ్రీశైలం,రాజు తదితరులు పాల్గొన్నారు.


ఆలయానికి నిధులు మంజూరు చేయాలి

షాబాద్: శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవాయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కొమరబండ దేవాలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవ రెడి కోరారు. మంగళవారం నగరంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చేవెళ్ల సుభాష్ చంద్రబోస్, నాయకులు తదితరులు ఉన్నారు.

CHANGE OF NAME

I, J Raghavendar Reddy S/o Late J Venkatram, R/o Darpally Village, Tahsil Nawabpet, Mahabubnagar Dist. Telangana., hereby State That My Wife Name Was Recorded In My Service Records As SRILATHA K. Her Actual And Correct Name As Per Aadhar Card Is JAINA SREELATHA.





చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు

షాద్‌నగర్‌రూరల్: తల్లిదండ్రులు నర్సరీ విద్య పేరుతో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి డబ్బులు వృథా చేసుకోవద్దని, మీ చిన్నారులకు అంగన్‌వాడీకి పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద సెక్టార్ పరిధిలోని ఎలికట్ట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, వసతులను తల్లులకు వివరించారు. చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో విశ్రాంత అంగన్‌వాడీ టీచర్ శారదమ్మ, టీచర్ రంగమ్మ, ఆయాలు సంతోష, లక్ష్మమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాలు

రంగాపూర్‌లో..

నందిగామ: మండల పరిధిలోని రంగాపూర్‌లో మంగళవారం అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మ మాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 3 నుంచి 5 ఏళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. ప్రీ స్కూల్ విద్య పిల్లలకు పునాది లాంటిదన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి, పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, సంతోష తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

చిన్నారులకు అక్షరాభ్యాసం

చేవెళ్ల: అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు అక్షర జ్ఞానంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఉమారాణి, మాజీ వార్డుసభ్యుడు హరికృష్ణ, ఆయాలు, చిన్నారులు, తల్లిదండ్రులు ఉన్నారు.

పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

కొందుర్గు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు విధిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న సూచించారు. మండలంలోని మహదేవ్‌పూర్, పుల్సుమామిడి గ్రామాల్లో మంగళవారం అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి నిత్యం భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పార్వతమ్మ, భాగ్యమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564